


మధ్యవర్తిత్వాన్ని వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్రతిరోజూ రాజీ యోగ్యమైన కేసుల్లో మధ్యవర్తిత్వం నిర్వహిస్తున్నారని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్యానెల్ న్యాయవాదులతో మంగళవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా వెనకబడిన కక్షిదారులకు నియమించిన ఉచిత న్యాయవాదుల పనితీరు, కేసుల పురోగతిపైన సమీక్షించారు. ఈ కేసులను త్వరితగతిన విచారించి పూర్తి చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న రత్నప్రసాద్

మధ్యాహ్న భోజనం
ప్రయివేటు చెరలోకి..!

ఉంగుటూరు నియోజకవర్గంలో అమలుకు తహతహ
'మధురాన్నం' సంస్థకు కాంట్రాక్టు అప్పగించేందుకు సన్నాహాలు
తొలుత నియోజకవర్గంలోని దాదాపు 34 హైస్కూళ్లలో అమలుకు ప్రతిపాదనలు
మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టకొట్టేందుకు మరోసారి కుట్ర
గతంలోనూ ఇదేవిధంగా కుట్ర, జనం నుంచి తిరుగుబాటు రావడంతో వెనక్కి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ప్రభుత్వ స్కూళ్లలో ఎంతో విజయవంతంగా అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటుకు అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉందా.. అందులో భాగంగానే ఉంగుటూరు నియోజకవర్గంలో మధ్యాహ్న భోజనం కాంట్రాక్టును 'మధురాన్నం' పేరుతో నిర్వహించే సంస్థకు అప్పగించే కుట్రలు జరుగుతున్నాయా' అంటే అవుననే సమాధానం వస్తోంది. విద్యార్థులకు వేడివేడిగా భోజనం వడ్డిస్తూ ఆకలితీర్చే మధ్యాహ్న కార్మికుల పొట్టకొట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్కూళ్ల ఎన్నో ఏళ్లుగా విజయవంతంగా సాగుతున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రయివేటు ఆధ్వర్యంలోని 'మధురాన్నం' పేరుతో నడిపే సంస్థకు కాంట్రాక్టు అప్పగించాలని చూస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ దీనిపై ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించారని, త్వరలో అన్నిచోట్లా అమలు చేసే విధంగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి వ్యవహారం చాపకింద నీరులా నడిచిపోతోంది. ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు దీన్ని ప్రత్యేక్షంగా పర్యవేక్షిస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవలే నియోజకవర్గంలోని హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఉంగుటూరు నియోజకవర్గంలో ఉన్న దాదాపు 34 హైస్కూళ్లలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనాన్ని 'మధురాన్నం' సంస్థకు ఇవ్వాలని చూస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై పలు హైస్కూళ్లలో తీర్మానాలు సైతం చేసినట్లు తెలుస్తోంది. దీంతో కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి. ఏలూరు జిల్లాలో మొత్తం 1,749 ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతోంది. లక్షా ఆరు వేల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు వేడివేడిగా విద్యార్థులకు వండి వడ్డిస్తున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి



విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5.88, ఆరు నుంచి పది వరకూ చదువుతున్న విద్యార్థులకు రూ.8.57 చొప్పున మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఏలూరు జిల్లాలో 3,236 మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఈ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఎప్పటి నుంచో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటుకు అప్పగించాలన్న ఆలోచనలు సాగుతున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులతోపాటు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో వెనక్కి తగ్గిన పరిస్థితి నెలకొంది. గత టిడిపి పాలనతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు అప్పగించాలని చూడడంతో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పశ్చిమగోదావరి జిల్లాలో 14,23 స్కూళ్లలో మధ్యాహ్న భోజనం నడుస్తుండగా, 80 వేల మందికిపైగా విద్యార్థులు లబ్ధిపొందుతున్నారు. గతంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటుకు అప్పగించాలన్న ఆలోచనలో భాగంగా మధురాన్నం సంస్థకు ఈ జిల్లాలో 56 స్కూళ్లలో అమలుచేశారు. తీవ్ర వ్యతిరేకత రావడంతో అక్కడితో ఆగిపోయారు. ఇప్పుడు మళ్లీ కుట్రలకు తెరలేపిన పరిస్థితి కనిపిస్తోంది. ముందుగా ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రారంభించి రెండు జిల్లాల్లోని అన్ని స్కూళ్లలో అమలు చేయాలన్న ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. అన్నీ కుదిరితే వచ్చే ఆగస్టు నెల నుంచే అమల్లోకి తేవాలని చూస్తున్నట్లు సమాచారం. మధురాన్నం సంస్థ గతంలో వైసిపి నాయకుడు చెరుకువాడ రంగనాథరాజు ఆధ్వర్యంలో నడిచేది.

ప్రయివేటుకు అప్పగిస్తే తీరని నష్టం..

మధ్యాహ్న భోజనాన్ని ప్రయివేటుకు అప్పగిస్తే అన్ని విధాలా తీరని నష్టం జరగనుంది. ప్రతిరోజూ పిల్లల హాజరు బట్టి మధ్యాహ్న భోజన కార్మికులు వంట సిద్ధం చేసి పెడతారు. ఒక రోజు వంద మంది వస్తే, ఒక రోజు 150 మంది పిల్లలు ఉండొచ్చు. విద్యార్థుల సంఖ్యను బట్టే వంట ఉంటుంది. ప్రయివేటుకు అప్పగిస్తే విద్యార్థుల హాజరు శాతం వారికి పట్టదు. స్కూళ్లలో చదివే మొత్తం విద్యార్థుల సంఖ్యను బట్టి భోజనం తెస్తారు. వర్షం కురవడం, వేరే కారణాలతో విద్యార్థులు తగ్గినా వండినదంతా పడేయాల్సిందే. సొమ్ము మాత్రం సంస్థకు చెల్లించాల్సిందే. దీంతో ప్రభుత్వానికి తీరని నష్టం జరగనుంది. అంతేకాకుండా ఏదో ఒక ప్రాంతంలో తెల్లవారు జామునే వంటలు చేసి స్కూళ్లకు సరఫరా చేస్తారు. విద్యార్థులు తినేసరికి వంటలు పాడైపోతాయి. గతంలోనూ ఇదే విధంగా జరిగింది. మరో పక్క వేలాది మంది మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి దెబ్బతింటుంది. మధ్యాహ్న భోజన ప్రయివేటుకు అప్పగించడంలో ఉంగుటూరు ఎంఎల్ఎ ఎందుకు ఇంత తహతహలాడుతున్నారంటూ తీవ్రమైన చర్చ కొనసాగుతోంది.

భూ సేకరణ పనులు వెంటనే పూర్తిచేయాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

పోలవరం ప్రాజెక్టు ఆర్అండ్ఆర్ పనుల భూసేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం పోలవరం ప్రాజెక్టు ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి భూ సేకరణపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటిడిఎ అపూర్వ భరత్, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి భూములందించిన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా భూమికి భూమి, ఆర్అండ్ఆర్ కాలనీల నిర్మాణం, తదితర పనులకు గాను ఏలూరు జిల్లాలో ఇంకా 5 వేల ఎకరాలు భూమి అవసరం కాగా ఇప్పటికే బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాలు 800 ఎకరాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. మిగతా 4,200 ఎకరాలు వారానికి 500 ఎకరాల చొప్పున ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. గిరిజనేతర భూములు మాత్రమే గుర్తించాలని, గిరిజనులు, ఇతరులు గానీ ఎటువంటి ఆక్రమణలు ఉండకూడదని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

భూసేకరణ కోసం భూమిని గుర్తించిన తర్వాత ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూములు గుర్తించిన తర్వాత ఆయా రైతులతో ఆర్‌డిఒ, డిఎస్‌పి, అధికారులు చర్చించి వారి సమక్షంలో గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. భూములకు పరిహారాన్ని ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రైతులకు చెల్లించటానికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ స్నేహ పూరిత వాతావరణంలో రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చేలా అధికార యంత్రాంగం వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళ వందనం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు నిర్మించాలి

న్యాయం చేయకపోతే పోరాటం ఉధృతం
రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని, ఆగస్టు 4న గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని గురవాయిగూడెంలోని మానవతా కళ్యాణ మండపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు వామిశెట్టి హరిబాబు అధ్యక్షత వహించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఆగస్టు 4న గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల ఏలూరు చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టాలని, ఎంపీలు, ఎంఎల్ఎలు, మంత్రులు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు వినతిపత్రాలు అందించాలని సదస్సులో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే హైవే పనులు అడ్డుకునే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు ప్రభుత్వాలు, అధికారులు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరలేదని, రైతులను మోసగించారని తీవ్రంగా విమర్శించారు. సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ మార్కెట్ విలువ ప్రకారం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చింతలపూడి, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం, దేవరపల్లి తదితర



ధర్నా చేస్తున్న రైతులు, నేతలు

మండలాల్లో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం వల్ల తలెత్తున సమస్యలన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు వామిశెట్టి హరిబాబు, అల్లూరి రామకృష్ణ, దేవరపల్లి సత్యనారాయణ, శీలం రామచంద్రరావు, ఎలికే తాతారావు, వందనపు సాయిబాబా, కె.నాగేశ్వరరావు, కె.రంగారావు, జి.నర్సిరెడ్డి, బొడ్డు రాంబాబు, పి.శ్రీహరి మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు రైతులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అవసరమైతే ఢిల్లీ వరకు వెళ్లి పోరాడుతామని హెచ్చరించారు. తొలుత గురవాయిగూడెంలో రైతులు ధర్నా చేపట్టారు. సర్వీస్ రోడ్లు నిర్మించాలని, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులను ఆదుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, చింతలపూడి, కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురం మండలాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సంతకాల సేకరణ



ఏలూరు అర్బన్ : సంతకాల సేకరణ చేపట్టి మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ఏలూరు వన్ టౌన్ బిర్లా భవన్ సెంటర్ నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఆనాడు తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చెప్పటమే కాకుండా, స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నాయకులు ఈనాడు వాటిని బిగించడానికి బరితెగించారని తెలిపారు. ప్రజలు స్మార్ట్ మీటర్లు బిగించుకోవద్దని, వెనక్కి పంపించాలని కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో జరుగుతున్న సంతకాల సేకరణకు ప్రజలంతా మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌టియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, ఎఐటియుసి నాయకులు ఉప్పులూరు హేమాశంకర్, సిఐటియు నాయకులు పంపన రవికుమార్, ఐద్వా నాయకురాలు అరుణకుమారి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జి.కోటేశ్వరరావు, చేతి వృత్తుదారులు కన్వీనర్ పిచ్చుకల ఆదిశేషు పాల్గొన్నారు.

చింతలపూడి : స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో రెండో రోజు ప్రగడవరంలో సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ రెడ్‌స్టార్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ



నిడమర్రులో..

ఎంఎల్ రెడ్‌స్టార్ నాయకులు డి.రంగనాథ్, సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు, సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు మాట్లాడుతూ విద్యుత్ భారాలను ప్రజలపై మోపుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు విధానానికి వ్యతిరేకంగా ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలను సమాయత్తం చేయడం కోసం సంతకాల సేకరణ చేపట్టామన్నారు. ఆగస్టు 5న జరిగే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు ఆర్‌వి.సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు కంచర్ల గురవయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్‌కె.కాలేషా, తాడిగడప మాణిక్యాలరావు పాల్గొన్నారు.

నిడమర్రు : మా ఊరికి స్మార్ట్ మీటర్లు బిగించొద్దంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భువనపల్లిలో ఇందిరమ్మ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు నారపల్లి రమణారావు ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ మీటర్లు మాకొద్దని కూటమి ప్రభుత్వ విధానాన్ని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పేదలను కొట్టి కార్పొరేటర్లు కట్టబెట్టడం కోసమే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. వ్యకాస నాయకులు గవర సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు కోన శ్రీనివాసరావు, వి.మోహన, సిఐటియు నాయకులు కానూరు రాజు, కమిలి నాని, చంద్రరావు పాల్గొన్నారు.

ఇవిఎం గొడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా కేంద్రమైన ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గొడౌన్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఇవిఎం గొడౌన్ వద్ద సిసి కెమెరాలతో చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం రిజిస్టర్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గొడౌన్ తనిఖీలో భాగంగా ఇవిఎం గొడౌన్‌కు వేసిన భద్రతా సీళ్లు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గొడౌన్‌కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు గొడౌన్‌ను క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామని తెలిపారు. ఇవిఎం గొడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, ఇతర సిబ్బంది ఉన్నారు.



ఇవిఎం గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

నిలకడగా గోదావరి వరద

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గత ఐదు రోజులుగా పెరుగుతూ తగ్గుతూ వచ్చిన గోదావరి వరద నిలకడగా ఉంది. సోమవారం భద్రాచలంలో 35.40 అడుగులు ఉన్న గోదావరి వరద నీటిమట్టం మంగళవారం ఉదయం నాటికి 36.20 అడుగులకు చేరుకుని నిలకడగా ఉంది. గోదావరి నిలకడగా ఉన్నా మండలంలోని కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉండటంతో వాగు అవతల ఉన్న 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వేలేరుపాడు రూరల్ : గోదావరి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంటే లోతట్టు ప్రాంతాల ప్రజలు తమ తమ గ్రామాల్లో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతూ తగ్గుతూ మంగళవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగి 36 అడుగులకు చేరుకుంది. మండలంలోని యడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్ వే నాలుగు రోజులుగా మునిగి ఉండటంతో సుమారు 20 గ్రాములకు దారి సౌకర్యాలు లేక ప్రజలు ఎనలేని అవస్థలు పడుతున్నారు. తమ తమ అవసరాల కోసం, నిత్యావసరాల కోసం మండల కేంద్రాన్ని చేరుకోవాలంటే కాజ్ వే దాటి ఆటోలు మారుతూ సుమారు 20 కిలోమీటర్లు వ్యయ ప్రయాసలతో ప్రయాణం చేసి తమ పనులు ముగించుకుని తిరిగి గ్రామాలు చేరుకోవాలంటే నానా అవస్థలు పడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంతో మండలంలో గోదావరి పరివాహక ప్రాంతాలైన రుద్రంకోట, రేపాక గొమ్ము, తాట్కూరుగొమ్ము, తదితర గ్రామాల్లోని నిర్వాసితులు వర్షాల ప్రభావం లేకున్నా గాని తమ తమ గృహోపకరణాలతో చాలా ఇబ్బందులు పడుతూ ముందుగానే గ్రామాలు ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

పోలవరం : పోలవరంలో గోదావరి నీటిమట్టం క్రమ



మునిగి ఉన్న ఎద్దు వాగు కాజ్ వే

క్రమంగా తగ్గుతూ పెరుగుతూ వస్తుంది. మంగళవారం మధ్యాహ్నానికి పెరిగిన గోదావరి సాయంత్రం నాటికి పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గింది. గోదావరి ఉపనదులు శబరి, సీలేరు, మంజీర, ఇంద్రావతి నదుల నుంచి అదనంగా వస్తున్న 6,70,355 లక్షల క్యూసెక్కుల గోదావరి నీటిని జలవనరులశాఖాధికారులు స్పిల్ వే నుంచి దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం నిలకడగా ఉన్నట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

యనమందల గ్రామంలోని ఎస్‌టి కాలనీలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ నెల రోజుల నుంచి యనమందల గ్రామంలోని ఎస్‌టి కాలనీలో తాగునీరు, వీధిలైట్లు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనీసం వారికి తాగునీరందించేందుకు అధికారులు, పాలకవర్గం గాని ఎటువంటి ప్రయత్నాలూ చేయడం లేదన్నారు. అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలని లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డి.దుర్గాభవాని, ఎల్.సరస్వతి, మాఊరి చిట్టెమ్మ, జె.సత్యవతి, గోపి, శ్రీనివాసరావు, వేణు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

పామాయిల్ కార్మికులను ఆదుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుదాఘాతాలతో ప్రాణాలు పోతున్నా పామాయిల్ కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టి.నరసాపురం మండలం జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము ప్రభాకర్ కుమారుడు కొమ్ము రవీంద్ర టి.నరసాపురంలో పామాయిల్ గెలలు నరుకుతుండగా విద్యుదాఘాతంతో మృతి చెందాడని తెలిపారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పునరావృతం అవుతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కోసం అడుగుతున్నా, కార్మికుల సంక్షేమం గురించి, వారి మరణాల గురించి పట్టించుకోకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ, ఉద్యానవన శాఖాధికారులు మొద్దు నిద్ర పోతున్నారని, మనిషి ప్రాణం కన్నా వారి జిఒలే ఎక్కువ అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చనిపోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని, చనిపోయిన రవీంద్ర కుటుంబానికి నష్టపరిహారం, ఫ్యాక్టరీ నుంచి రూ.పది లక్షలు, కరెంటు డిపార్ట్‌మెంట్ నుంచి రూ.పది లక్షలు ఇవ్వాలని తెలిపారు. పామాయిల్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు.

సొసైటీని ప్రగతి పథంలో నడిపిస్తా

భీమడోలు రైతు సేవా సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా గన్ని



గన్నిని అభినందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు రైతు సేవా సహకార సంఘాన్ని ప్రగతిపథం వైపు పయనింపజేసేందుకు కృషి చేస్తానని సంఘం నూతన ఛైర్‌పర్సన్‌గా నియమితులైన గన్ని వీరాంజనేయులు అన్నారు. ఆప్కాబ్ ఛైర్మన్‌తో పాటు, డిసిసిబి జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన గన్ని వీరాంజనేయులు భీమడోలు రైతు సేవా సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ ఇతర సభ్యులు గేదెల శ్రీనివాసరావు, వెజ్జు రాంబాబుతో కలిసి సంఘం కార్యాలయ ఆవరణలో మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమానికి ఆప్కాబ్ ఎమ్‌డి శ్రీనాథ్‌రెడ్డి హాజరయ్యారు. బాధ్యతలు స్వీకరించిన గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఇదే క్రమంలో వారికి ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా అందుబాటులో ఉంచడంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులను భద్రపరుచుకునేందుకు శిథిలమైన గోదాముల స్థానంలో నూతన గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఒక ఏడాది పాటు ఖర్చుల నియంత్రణ, ఆదాయం పెంపు మార్గాలు చేపడతామన్నారు. ఇదే క్రమంలో రైతులు, సంఘం అధికారులు రాబడి పెంపొంచిందేందుకు ప్రత్యామ్నాయ మార్గాల గురించి, నూతనంగా వ్యాపార అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు అం2ంచాలని కోరారు. తన హయాంలో సంఘాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రస్తుతం సంఘం ద్వారా రూ.27 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. దీనికోసం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నుంచి రూ.26.82 కోట్ల రుణాలు తెచ్చామన్నారు. తిరిగి రుణాల రూపంలో రూ.24.38 కోట్లు అప్పులుగా ఇచ్చామన్నారు. సంఘం పరంగా రూ. 2.92 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. సంఘం ద్వారా 1836 ఖాతాలు లావాదేవీలు నిర్వహిస్తున్నారన్నారు. సంఘంలో 1259 మంది సభ్యులు, 2798 మంది షేర్ హోల్డర్లతో కలిపి 4057 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. రానున్న కాలంలో సంఘ పరిధిలోని ప్రతి రైతు సంఘంలో ఖాతా కలిగి ఉండడంతో పాటు, తమ లావాదేవీలన్నీ సంఘం ద్వారా నిర్వహిం చుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం నిర్మాణం కోసం రూ.60 లక్షలు నిర్వహణ వ్యయం అవుతుండగా, నికర ఆదాయం రూ.32 లక్షల వరకు వస్తుందన్నారు. ఎరువులు ఇతర అమ్మకాల ద్వారా వచ్చే రాబడి పోను రూ.16 లక్షల వరకు సంఘానికి అప్పులు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటిని అధిగమిస్తామని, రానున్న కాలంలో ఉత్తమ సహకార సంఘంగా తీర్చిదిద్దుతామని భరోసా వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి సిఇఒ సింహాచలం, డిసిఒ ఎ.శ్రీనివాస్, భీమడోలు డిసిసిబి మేనేజర్‌తో పాటు ఎఎంసి ఛైర్‌పర్సన్ ఎస్ఎస్.గిరి, భీమడోలు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజు, భీమడోలు గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజ, కూటమి నాయకులు, ప్రముఖులు, తెలుగుదేశం ఐటి విభాగం నాయకులు ఉండవల్లి బాలనందం పాల్గొన్నారు.

సంక్షేమ పెన్షన్ల విడుదల కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పెన్షన్లను విడుదల చేయాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వద్ద దళిత సేన ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులందరికీ వృద్ధాప్య, వితంత, డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే చర్మకారు, వికలాంగుల పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరల వల్ల పేదల జీవన విధానం చాలా కష్టంగా ఉందని, వెంటనే వీరి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు అర్హులందరికీ సంక్షేమ పెన్షన్లను మంజూరు చేయాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దళిత సేన మహిళా జిల్లా అధ్యక్షురాలు బేతాలు జయసుధ, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చిలి మోహనరావు, ఏలూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్, ఏలూరు జిల్లా దళిత సేన ప్రధాన కార్యదర్శి లక్కపాము చంటి, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వలోకి దూసుకెళ్లిన కారు

విప్రో మాజీ ప్రొఫెసర్ మృతి

లింగాలలో విషాదఛాయలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పోల్‌రాజ్ మురుగు కాలువలోకి కారు దూసుకెళ్లడంతో విప్రో మాజీ ప్రొఫెసర్ మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు ముదినేపల్లిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండలంలోని లింగాల గ్రామానికి చెందిన చందు వెంకటేశ్వరరావు(65) విప్రోలో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. హైదరాబాద్ నుంచి స్వగ్రామం లింగాల వచ్చేందుకు భార్యాభర్తలిద్దరూ కారులో బయలుదేరారు. ఈ క్రమంలో కారు ప్రమాదవశాత్తు ముదినేపల్లి సమీపంలో ఉన్న పోల్‌రాజ్ మురుగు కాలువలోకి దూసుకుపోయింది. గమనించిన చేపల చెరువుపై ఉంటున్న బీహార్‌కు చెందిన యువకులు వెంటనే మురుగు కాలువలోకి దూకి కారులో నుంచి భార్యాభర్తలను బయటకు తీసుకొచ్చారు. అయితే కాలువలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో వెంకటేశ్వరరావు ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆయన భార్య ప్రాణాలతో బయటపడ్డారు. వెంటనే బీహార్ యువకులు వెంకటేశ్వరరావును స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందినట్టు నిర్ధారించారు. వెంకటేశ్వరరావుకు ముగ్గురు కుమారులు అమెరికాలో ఉంటున్నారు. ఆయన మరణ వార్త విన్న లింగాల గ్రామస్తులు పెద్ద సంఖ్యలు ముదినేపల్లి ఆసుపత్రి వద్దకు తరలివచ్చి మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. ఈ ప్రమాద ఘటన జరిగిన రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. మురుగు కాలువ వంతెన వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా పెట్టకపోవడంతో మలుపు గమనించని వెంకటేశ్వరరావు కారును ఈస్ట్రగా నడపడంతో కారు మురుగు కాలువలోకి దూసుకుపోయింది. దీంతో ప్రమాదం జరిగి వెంకటేశ్వరరావు మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. భర్త మృతదేహాన్ని చూసి భార్య విలపిస్తున్న తీరు అందరిని కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరగకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వ్యాపారాలు నిత్యావసర సరుకులను అక్రమంగా నిల్వలు చేసి, బహిరంగ మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలు పెంచే అవకాశం ఉన్నందున, నిత్యావసర సరుకుల అక్రమ నిల్వలపై నిఘా పెట్టాలన్నారు. వ్యాపారులు పెద్దఎత్తున అక్రమ నిల్వలకు పాల్పడితే గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎస్‌ఒ విలియమ్స్, ఉద్యానవనశాఖ శాఖ డిడి రామ్మోహన్ పాల్గొన్నారు.

'స్వామిత్వ'పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వామిత్వ పథకంపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ నిఖిల్ మధు శరత్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ, రెవెన్యూ సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిత్వ పథకం ద్వారా గ్రామాల్లోని సొంత భూములు, గృహాలు మొదలైన ఆస్తులపై నిజమైన యజమాన్య హక్కులను గుర్తించి, పట్టా పత్రాలు సులువుగా జారీ చేయవచ్చని సూచించారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో స్వామిత్వ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భూములకు సంబంధించి డ్రోన్ సర్వేలు సక్రమ స్థితిలో నిర్వహించాలని ఎంపిడిఒ చెప్పారు. ప్రజల ఆస్తులు, భూములు, స్థిర నివాసాలు, డ్రైనేజీ, రోడ్ల వంటివన్నీ డ్రోన్ సర్వే ద్వారా నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ, రోడ్ల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ఎస్‌సి హాస్టల్ పున:ప్రారంభానికి కృషి

కుక్కునూరు :మండలంలోని అమరవరంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పున:ప్రారంభించేందుకు కృషి చేస్తానని కొయ్యలగూడెం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగ సాయమ్మ అన్నారు. అమరవరం హాస్టల్‌ను ఆమె మంగళవారం సందర్శించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలోని మూతపడిన గదులను తాత్కాలిక హాస్టల్ ఏర్పాటుకు ఉపయోగించే అవకాశాలను పరిశీలించారు. జనసేన నాయకులు మేకా ఈశ్వరయ్య, పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం, స్థానిక ఎంపీ లాడ్స్ నిధులతో మౌలిక వసతుల కల్పనకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

నేరాలు - ఘోరాలు

బైక్ చోరుల ముఠా అరెస్టు

రూ.8.8 లక్షల విలువైన 17 బైక్‌లు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా పోలీసులు మరో మారు పెద్ద మొత్తంలో చోరీకి గురైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో మూడో పట్టణ పోలీసులు 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి వెల్లడించారు. కొంతకాలంగా ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు చోరీపై ఏలూరు, ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ఏలూరు మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐ రాంబాబు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా వారు కృష్ణాజిల్లా గుడివాడ ప్రాంతానికి చెందిన సయ్యద్ రజాక్ అతని సోదరుడు సయ్యద్ కరీముల్లాగా గుర్తించారు. ద్విచక్ర వాహనాల దొంగతనాల్లో వారు సిద్ధహస్తులుగా గుర్తించారు. వారి వద్ద నుంచి 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.6.60 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు.

భీమడోలు సిఐ యుజె విల్సన్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మరో ఇద్దరు అనుమానితులను మీరు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. దెందులూరు గ్రామానికి చెందిన కత్తెర సోమయ్య, అదే గ్రామానికి చెందిన కాళిదాసు దైవరాజుగా గుర్తించి వారి వద్ద నుంచి మూడు దిచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.40 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 17 విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.8.8 లక్షలని తెలిపారు.

చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

చోరీకి గురైన బంగారు ఆభరణాలను ఒకటో పట్టణ పోలీసులు రికవరీ చేశారని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. వివరాల ప్రకారం.. నగరంలోని ఒకటో పట్టణ పరిధిలోని ఎన్నమూరి భాస్కరరావు అనే వ్యక్తి గత నెల 8వ తేదీన ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి గత నెల 13వ తేదీన ఇంటికి వచ్చి చూసుకునేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉండాల్సిన బంగారు ఆభరణాలు చోరీకి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఏలూరు ఒకటో పట్టణ పరిధిలో కైకలూరు-మాదేపల్లి రోడ్డులో వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్నన ఇద్దరిని అదుపులోకి ప్రశ్నించగా తెనాలి ప్రాంతానికి చెందిన పాత నేరస్తులు పిల్లి సురేష్, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ప్రాంతానికి చెందిన నాగళ్ల ముత్తయ్య గుప్తాగా గుర్తించారు. విచారణ చేపట్టగా గృహ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి వారి వద్ద నుంచి 125 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రతిభ కనబర్చినవారికి ఎస్‌పి ప్రశంసాపత్రాలు అందించారు

కారు బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

ముదినేపల్లి :కారు అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలంలోని వడాలిలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... విజయవాడ నుంచి కలిదిండి మండలం కొచ్చర్ల వెళుతున్న కారు వడాలి ఊరి చివర మలుపు వద్ద అదుపుతప్పి పశువుల పాకలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొచ్చర్లకు చెందిన మహేష్‌కు గాయాలయ్యాయి. పశువుల పాకలో ఉన్న పశువు కొమ్ములు విరిగాయి. ఈ ప్రమాదానికి కారణం కార్ డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

రూ.57.60 లక్షల విలువైన 480 సెల్‌ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా పోలీసులు 16వ సారి పెద్దఎత్తున సెల్‌ఫోన్లు రికవరీ చేసి పోగొట్టుకున్న బాధితులకు అందించారు. నగరంలోని పోలీసు కళ్యాణమండపంలో ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్ మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఇప్పటివరకు 15 సార్లు సెల్‌ఫోన్లను రికవరీ చేశామని, 16వ సారి రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించామని తెలిపారు. మొత్తంగా 480 సెల్‌ఫోన్లు రికవరీ చేయగా వాటి విలువ రూ.57.60 లక్షలు ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఫిర్యాదు చేసిన సెల్‌ఫోన్ల రికవరీ శాతం 41.24గా నమోదైందని తెలిపారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సిఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని, సైబర్ నేరాలకు సంబంధించిన వివరాలను, ఫిర్యాదులను చేసేందుకు 1930 నెంబర్‌ను వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి సూర్యచంద్రరావు, డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, సిసిఎస్ సిఐ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ముసునూరు

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటాలని ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రేమలి సురేష్ అనే విద్యార్థి తన పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాలలో ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ విధంగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, సురేష్, షకీలా, నాగమల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవరం సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని కృష్ణవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్‌గా జనసేన మండల నాయకులు కొండిశెట్టి శ్రీనివాసరావు, త్రిసభ్య కమిటీ సభ్యులుగా పోట్రు రామారావు, వీరాబత్తిన విశ్రాంతలు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపికైన త్రిసభ్య కమిటీ సభ్యులు సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు, మంత్రి పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు. త్రిసభ్య కమిటీ సభ్యులను జనసేన నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు, జనసేన మండల ఉపాధ్యక్షుడు ముక్కు మహేష్ పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగహనా ర్యాలీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం, టి.నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో డెంగీ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా కీటక జనిత వ్యాధులపై అవగహనా ర్యాలీ వైద్యధికారులు ఆంజనేయులు, జె.కల్పనరాణి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్.ఎ.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, ప్రతి శుక్రవారం పొడివారంగా పాటించాలని ఆయన తెలిపారు. జ్వరం వస్తే రక్త పరీక్షలు చేయించుకోవాలని, మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వ్యాధుల నివారణపై అందరూ అవగహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తర్ణాధికారి ఏడుకొండలు, సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎంపిహెచ్‌ఎలు, ఎఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక 31వ డివిజన్ పత్తేబాదలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి నాయుడు సోము, 31వ డివిజన్ ఇన్‌ఛార్జి పృధ్వీలక్ష్మి, కో ఇన్‌ఛార్జి ఐకా పరమేశ్వర్, కో క్లస్టర్ ఇన్‌ఛార్జి పోలినాటి సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్‌కు సహకరించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉపాధి హామీ చట్టం 17వ విడత సామాజిక తనిఖీ బృందానికి పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ ఉద్యోగులు సహకరించాలని ఎంపిడిఒ రాజ్‌మనోజ్ కోరారు. సామాజిక తనిఖీ రాష్ట్ర స్థాయి ఆడిట్ అధికారి తిరుమలరావుతో పాటు పలువురు జిల్లా స్థాయి తనిఖీ సిబ్బంది (డిఆర్‌పిలు)తో కో-ఆర్డినేషన్ సమావేశం మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయం వెల్ఫేర్ ఉద్యోగులతో నిర్వహించారు. ఉంగుటూరు మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, సర్వశిక్షణా అభియాన్ నిధులతో చేపట్టిన పనులు, పంట బోదెల్లో పూడిక తీత, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తదితర అంశాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించే బృందానికి రికార్డులు అప్పగించామని ఎంపిడిఒ చెప్పారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన తరువాత గ్రామ సభల ద్వారా పనుల ప్రగతిని చదివినిపిస్తారు. అనంతరం మండల కేంద్రంలో పబ్లిక్ హియరింగ్ ఉంటుందని ఎస్‌ఆర్‌పి తిరుమలరావు తెలిపారు. మండలంలో పలు చోట్ల ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు గతంలోనే అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సోషల్ ఆడిట్ బృందం నివేదకపై ఆసక్తి నెలకొంది.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

సైబర్ నేరాలు, మోసాల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అవసరం మేరకు పోలీసుల సహకారం తీసుకోవాలని శక్తి టీమ్‌కు చెందిన కమల సుజని, లక్ష్మీసుజని కోరారు. మండలంలోని మల్కీ మహమ్మద్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీటిపై వారు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు అంశాల గురించి వివరించారు. బాల్యవివాహాల నిరోధక చట్టం, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన. కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అరుణ పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న పాఠశాల పైకప్పులు

భయాందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
పట్టించుకోని విద్యాశాఖాధికారులు

ప్రజాశక్తి - చింతలపూడి


పెచ్చులూడిన స్లాబ్

వర్షం కురిస్తే మండలంలోని మల్లయగూడెంలో ప్రభుత్వ పాఠశాల భవనం స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షం కురిసినప్పుడు భవనం పైకప్పు నుంచి నీరు కారి తరగతి గదుల్లోకి చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెచ్చులు ఊడి పడతుండడరో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని విద్యార్థులు భయంతో బిక్కుబిక్కుమంటూ విద్య అభ్యసిస్తున్నారు. పాఠశాల భవనం నాడు-నేడులో పెట్టినప్పటికీ నిధులు మంజురు కాని పరిస్థితి. పాఠశాలలో సుమారు 20 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనం పూర్తి చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పాఠశాల, భోజనశాల భవనాలను పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, పలు సంఘాల నేతలు కోరుతున్నారు.

అక్టోబర్ నాటికి వంద పడకల ఆసుపత్రి పూర్తి

చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

అక్టోబర్ నాటికి వంద పడకల ఆసుపత్రి పూర్తి చేస్తామని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి ఏరియా హాస్పిటల్ వద్ద మంగళవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి వార్డుకు తిరిగి సేవలు, వైద్య సిబ్బంది పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధిపై కూటమి నాయకుల అభిప్రాయలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి ఆసుపత్రిని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని, నూతనంగా వచ్చిన మత్తు వైద్య నిపుణులకు, చిన్న పిల్లల వైద్య నిపుణులకు ఆహ్వానం పలికి మంచి సేవలందించాలని కోరారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రికి వైద్యులు వస్తారని, జిల్లా అధికారులతో మాట్లాడుతున్నామని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నారాయణరావు, కమిటీ మెంబర్లు దేవా, భారతి, టౌన్ ప్రెసిడెంట్ అప్పారావు, జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు, ఆసుపత్రి వైద్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

పామాయిల్ ఫ్యాక్టరీ నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

పామాయిల్ గెలలు కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన టి.నరసాపురంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము ప్రభాకర్ కుమారుడు రవీంద్ర (22) మరో యువకునితో కలిసి టి.నరసాపురం గ్రామానికి చెందిన రైతు పొలంలో పామాయిల్ గెలల నరికే పనికి వెళ్లాడు. యువకులు గెలలు కోస్తుండగా రవీంద్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు అతడిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

రూ.పది లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి : సిఐటియు

పామాయిల్ గెలలు కోస్తూ విద్యుదాఘాతంతో మృతి చెందిన రవీంద్ర కుటుంబానికి రూ.పది లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. పామాయిల్ గెలలు నరికే కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మృతుని కుటుంబీకులతో కలిసి ధర్నా నిర్వహించారు. పోలీసులు ఆందోళనకారులతో చర్చించడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా శ్రీను, ప్రసాద్, నాగరాజు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి రూ.పది లక్షలు, కరెంటు డిపార్ట్‌మెంట్ నుంచి రూ.పది లక్షల నష్టపరిహారం ఇవ్వాలని పామాయిల్ కార్మిక సంఘంగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన వంగూరు గౌతమీ ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా

ఏలూరు అర్బన్ :కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా ఫ్యాక్టరీ గేటుకు తాళం వేయడాన్ని నిరసిస్తూ మంగళవారం కార్మికులు ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. జీతాలుపెంచడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాలుగు నెలలుగా శాంతియుత పద్ధతులలో ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడంతో సోమవారం వంగూరు గౌతమీ ఫ్యాక్టరీ కార్మికులు ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీంతో యాజమాన్యం గేటుకు తాళం వేసి పనులు నిలుపుదల చేసింది. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కార్మికులు మంగళవారం స్థానిక కండ్రికగూడెం సెంటర్ నుంచి ప్రదర్శనగా బయలుదేరి అశోక్‌నగర్ వంతెన మీదుగా లేబర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ గంట సేపు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.రాణికి వినతిపత్రం అందించారు. ఆమె స్పందించి వెంటనే మేనేజ్‌మెంట్‌తో ఫోన్‌లో సంప్రదించారు. వెంటనే గేటుకు తాళం తీసి కార్మికులందరికీ పనులు కల్పించాలని, కార్మిక సమస్యలను యాజమాన్యం-కార్మిక సంఘం చర్చించి పరిష్కరించుకోవాలని, లేకుంటే చట్టప్రకారం తాము చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిసిఎల్ ద్వారా వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు ఊరేగింపుగా చాణక్యపురి కాలనీలోని పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి, గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు యు.వెంకటేశ్వరరావు (యువి), ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, యూనియన్ ప్రెసిడెంట్ బెజవాడ పద్మావతి మాట్లాడారు. కనీస వేతనాలు చెల్లించా లని, బోనస్ వెంటనే ఇవ్వాలని, ఇఎస్‌ఐ, పిఎఫ్ బకాయిలు వెం టనే చెల్లించాలని, ఫ్యాక్టరీలో కనీస సదుపా యాలు కల్పిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఆలీసమ్మ, రంగమ్మ, రాణి, సత్యవతి, బేబి నాయకత్వం వహించారు.

ఆక్రమణలోని అటవీ భూమి స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు అటవీశాఖ పరిధిలోని కాట్రేనిపాడు బ్లాక్‌లో ఉన్న ఆర్ఎస్-1 లోని 454/1లో ఉన్న 15 ఎకరాల పామాయిల్ తోట ఆక్రమించిన రైతు నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి టి.సత్యనారాయణ తెలిపారు. నూజివీడులో ఆయన మంగళవారం మాట్లాడుతూ అటవీ భూమి ఆక్రమణకు సంబంధించి కేసు కోర్టులో సుదీర్ఘకాలం కొనసాగినట్లు తెలిపారు. కోర్టులో వాద ప్రతి వాదనలు ముగిసిన అనంతరం 2023లో కాట్రేనిపాడు బ్లాక్‌లోని 15 ఎకరాల పామాయిల్ తోట భూమి అటవీ శాఖకు చెందిన భూమిగా కోర్టు నిర్ధారిస్తూ స్వాధీనం చేసుకోవాలని తీర్పునిచ్చినట్లు చెప్పారు. కోర్టు ఇచ్చిన ఆదేశానుసారం భూమిని ఆక్రమించిన రైతు నుంచి అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దిగుబడి కోల్పోయిన పామాయిల్ మొక్కలను తొలగించి అడవుల అభివృద్ధికి అటవీ జాతికి చెందిన మొక్కలను 15 ఎకరాల భూమిలో పెంచనున్నట్లు వివరించారు.

తల్లిదండ్రులకు బాలుడు అప్పగింత

ఏలూరు స్పోర్ట్స్ :బాలుడు కనిపించకుండాపోయిన గంటల వ్యవధిలో అతడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన రెండో పట్టణ సిఐ అశోక్ కుమార్‌ను డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ అభినందించారు. వివరాల ప్రకారం... నగరంలోని కోటదిబ్బ ప్రాంతానికి చెందిన దాసరి సురేంద్ర కుమారుడు రోహన్ సోమవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో రోహన్ తల్లిదండ్రులు ఏలూరు రెండో పట్టణ సిఐ అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సిఐ బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడు గిద్దలూరు ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి అతడిని క్షేమంగా గంటల వ్యాధిలో బుధవారం తెల్లవారుజామున ఏలూరు తీసుకొచ్చారు. బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

నానో యూరియా డిఐపిలను వాడాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని సీతారామపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు జి.విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రస్తుతం వరి నారుమడుల్లో, ప్రధాన పంటలో జింక్ లోపల లక్షణాలు కనిపిస్తే జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి వారం రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. ప్రతి రైతూ యూరియా, డిఎపిలకు బదులుగా నానో యూరియా, నానో డిఎపిల ఎరువులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఏలూరు వ్యవసాయ అధికారి ఎం.ఉషాకుమారి, మండల వ్యవసాయాధికారి చెన్నారావు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని పోతునూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయక సంచాలకులు సుబ్బారావు మాట్లాడుతూ వరి పంటలో కలుపు నివారణ, తెగుళ్ల, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. డిఎపిఎటి సెంటర్ (ఏరువాక కేంద్రం) సైంటిస్ట్ ఫణికుమార్ మాట్లాడుతూ రైతులందరూ ఇ-పంట నమోదు చేయించుకోవాలని, కౌలు రైతులు కౌలు కార్డులు తీసుకోవాలని తెలిపారు.

గిరిజన సంక్షేమ కమిటీ మెంబర్‌గా ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రాష్ట్ర గిరిజన సంక్షేమ కమిటీ మెంబర్‌గా పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజును నియమించినట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కమిటీలో తనను మెంబర్‌గా నియమించడం అభినందనీయమని పేర్కొన్నారు.

మానవత్వం చాటిన ఎంపిపి రామారావు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం-జంగారెడ్డిగూడెం రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఎంపిపి రామారావు సకాలంలో సహాయం అందించారు. తాడేపల్లిగూడెం నుంచి జంగారెడ్డిగూడెం బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలీని వాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. అదే సమయంలో రానూజపురంలో గ్రామంలో రోడ్డు పనులను పరిశీలించి తిరిగి వస్తున్న ఎంపిపి గంజిమాల రామారావు, పరింపూడి వార్డు సభ్యుడు పూలపల్లి రవి బాధితుడిని గమనించారు. వెంటనే స్పందించి 108 వాహనానికి సమాచారం ఇచ్చినా సకాలంలో రాకపోవడంతో ఎంపిపి తన వాహనంలో బాధితుడిని కొయ్యలగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యునిగా వీరాసురేష్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎం.వీరాసురేష్‌ను నియమిస్తూ నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్ పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్ మంగళవారం ఉత్తర్వులు అందించారు. ఇప్పటివరకు స్టాండింగ్ కౌన్సిల్లో సభ్యుడిగా ఉన్న వెంకటనారాయణ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులు కావడంతో ఖాళీ అయిన స్థలంలో సురేష్‌ను నియమించినట్లు ఎస్‌ఎంఆర్ పెదబాబు, భానుప్రతాప్ తెలిపారు.

రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో మసీద్ సెంటర్ నుంచి జివి.మాల్ వరకు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ, ఛైర్మన్ బత్తిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో రోడ్లు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు మాట్లాడుతూ మున్సిపాలిటీ నిధులు రూ.మూడు లక్షలతో తాత్కాలికంగా రోడ్ల మరమ్మతులు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పరిమి సత్తిపండు, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ కొండేటి కిషోర్, వైసిపి నాయకులు బత్తిని చిన్న, కౌన్సిలర్లు, వైసిపి సీనియర్ నాయకులు కంచర్ల విష్ణు, తదితరులు పాల్గొన్నారు.